తెలుగు దినపత్రిక
ప్రభాత jayabheridaily.com
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
సంపుటి : 01
సంచిక : 145
పేజీలు : 4
వెల : 4
మల్కాజిగిరి
శుక్రవారం, 15-12-2023

జయభేరి దినపత్రిక,
జయభేరి ఛానల్ లో
నిఖార్సైన
జర్నలిస్టులుగా
నిలబడాలను
కుంటున్నారా?
ఆసక్తి కలిగిన యువతి
యువకులకు అవకాశం
అనుభవం ఉన్నవారికి
ప్రాధాన్యత
email: jayabherinews@
gmail.com,
www.jayabheridaily.com
Call me: 9391 544 889



# అసెంబ్లీ ఫైట్

ప్రతిపక్షనేత హోదాలో కేసీఆర్

2 లో

హైదరాబాద్, డిసెంబర్ 14:

తెలంగాణ ఎన్నికల ఫైట్ ముగిసింది. ఆ ఫైట్ లో కాంగ్రెస్ ను అధికార పార్టీగా కూర్చోబెట్టిన ఓటర్లు, అధికారంలో ఉన్న బీఆర్ఎస్ కు ప్రతిపక్ష హోదా కట్టబెట్టారు. ఇప్పుడు ఆ రెండు పార్టీల స్థానాలు మారినా ఫైట్ మాత్రం కామనే. అయితే ఇప్పుడు నిన్న మొన్నటిదాకా సాగిన ఎన్నికల సమరం కాస్తా అసెంబ్లీ ఫైట్ గా మారనుంది. ఈ అసెంబ్లీ సమావేశాల్లో అధికార పార్టీ 64 మంది సభ్యులతో, ఒక్క సీపీఐ ఎమ్మెల్యే మద్దతుతో, ప్రతిపక్ష పార్టీగా ఉన్న బీఆర్ఎస్ ను ఎదుర్కొనేందుకు సిద్ధమవుతోంది. మరో వైపు 39 ఎమ్మెల్యేలతో గులాబీ పార్టీ, 8 మంది ఎమ్మెల్యేలతో కమలం పార్టీ, 7 గురు ఎమ్మెల్యేలతో ఎం.ఐ.ఎం పార్టీ ఈ కొత్త అసెంబ్లీలో కొలువు తీరనున్నాయి. ఇవన్నీ కాంగ్రెస్ టార్గెట్ గా పని చేయనున్నాయి.

## ఎంసీహెచ్ఆర్డీలో ఉన్న కాళీ స్థలంలో తన క్యాంపు ఆఫీస్ నిర్మాణం


- కొత్తగా ఎలాంటి భవనాలు నిర్మించబోము
- శాసనసభ భవనాలను సమర్థంగా వాడుకుంటాము
- బీఆర్ఎస్ ప్రభుత్వం 12, 14 గంటలకు మించి విద్యుత్ ఇవ్వలేదు
- శుక్రవారం శాసనసభ సమావేశాల ఎజెండాపై నిర్ణయం
- మీడియాతో నిర్వహించిన చిట్చాట్లో సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్, డిసెంబర్ 14 :

పాత అసెంబ్లీ బిల్డింగ్లో కౌన్సిల్ సమావేశాలు, ఇప్పుడు ఉన్న అసెంబ్లీలో శాసనసభ జరుగుతుందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. గురువారం మీడియాతో నిర్వహించిన చిట్చాట్లో సీఎం మాట్లాడుతూ.. పార్లమెంట్ తరహాలో అసెంబ్లీ ఉండబోతోందని అన్నారు. ఎంసీహెచ్ఆర్డీలో ఉన్న కాళీ స్థలంలో తన క్యాంపు ఆఫీస్ నిర్మాణం చేస్తామన్నారు. ప్రజా భవన్లో ఇంకో బిల్డింగ్ ఉందని.. అది ఇంకో మంత్రికి ఇస్తామన్నారు. రాయదుర్గం నుంచి ఎయిర్పోర్టుకు మెట్రో ఉపయోగకరంగా ఉండదని.. మరోరూట్లో మెట్రో ప్లాన్ చేస్తామని సీఎం తెలిపారు. ఎంసీఆర్ హెచ్ఆర్డీలోని ఖాళీ స్థలాన్ని అవసరాల కోసం వినియోగించుకుంటామన్నారు. ప్రజాభవన్లో ఉన్న ఆఫీసు కార్యాలయాన్ని ఉపయోగించుకుంటామని.. కొత్తగా ఎలాంటి భవనాలు నిర్మించబోమని స్పష్టం చేశారు. శాసనసభ భవనాలను సమర్థంగా వాడుకుంటామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యుత్ 12, 14 గంటలకు మించి ఇవ్వలేదన్నారు. శ్వేతపత్రాలు సహా అన్ని అంశాలపై అందరితో చర్చించి సమయం వచ్చినప్పుడు విడుదల చేస్తామని తెలిపారు. శాసనసభ సమావేశాల ఎజెండాపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. గవర్నర్ ప్రసంగానికి కేబినెట్ ఆమోదం తెలిపిందని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు.

## యుద్ధం తీవ్రరూపం



న్యూఢిల్లీ, డిసెంబర్ 14 :

ఇజ్రాయెల్ పాలస్తీనా మధ్య యుద్ధం రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతోంది.. ఇజ్రాయెల్ ప్రతీకార దాడులతో పాలస్తీనా గజగజ వణికిపోతోంది.. ఇప్పటివరకు 7 వేల మందికి పైగా హమాస్ మిలిటెంట్లను హతమార్చింది ఇజ్రాయెల్. గాజాలో ఇప్పటివరకు 17వేల మందికి పైగా మరణించారు. అదే సమయంలో 46 వేల మందికి పైగా గాయపడ్డారు.. గాజాలో ఆహారం, నీరు, నిత్యావసరాల కొరత తీవ్రంగా ఉంది. మానవతా సాయం అందక గాజా జనాభాలో 90 శాతం మంది ప్రతిరోజు తిండి తినలేకపోతున్నారు. హమాస్ను పూర్తిగా నాశనం చేసే వరకు ఈ యుద్ధం కొనసాగుతుందని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు స్పష్టం చేశారు. ఈ ప్రకటన తర్వాత ఇజ్రాయెల్ సైన్యం మరింత ప్రమాదకరంగా దాడులు చేయడం మొదలు పెట్టింది. 23 లక్షల గాజా జనాభాలో దాదాపు 85 శాతం మంది బతుకుజీవుడా అంటూ స్వస్థలాలను వదిలిపోయినా సరే ఇజ్రాయెల్ దాడులు తగ్గించడం లేదు..దాదాపు 834 కోట్ల విలువైన యుద్ధ ట్యాంక్ ఆయుధాలను ఇజ్రాయెల్కు అమ్మేందుకు అమెరికా అంగీకరించడం చూస్తుంటే ఇజ్రాయెల్ దూకుడు ఇప్పట్లో ఆగేలా లేదు..గాజాలో పరిస్థితులు మరింత దిగజారుతున్నాయి.




## స్పీకర్ గా గడ్డం ప్రసాద్

హైదరాబాద్, డిసెంబర్ 14

తెలంగాణలో మరోసారి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయిన తరువాత రెండో సారి అసెంబ్లీ సమావేశాలను నిర్వహించారు. గతంలో రేవంత్ రెడ్డితో సహా మిగిలిన మంత్రులు ప్రమాణ స్వీకారం చేశారు. అయితే ఈ రోజు శాసనసభ సభాపతిని ఏకగ్రీవంగా ఎన్నుకున్న నేపథ్యంలో మరోసారి అసెంబ్లీ సమావేశాలు నిర్వహించారు. ముందుగా ప్రోటెం స్పీకర్ అక్బరుద్దీన్ ఓవైసీ గడ్డం ప్రసాద్ను అసెంబ్లీ స్పీకర్గా అధికారికంగా ప్రకటించారు. ఆ తరువాత స్పీకర్గా ఎన్నికైన గడ్డం ప్రసాద్కు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అభినందనలు తెలిపారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. గడ్డం ప్రసాద్ను స్పీకర్ గా ఎంపిక చేయడంపై అన్ని పార్టీలు సహకరించాయన్నారు. అసెంబ్లీ స్పీకర్గా తొలిసారి దళిత నేతను ఎంపిక చేయడం చాల సంతోషంగా ఉందన్నారు. సభాపతిని పోడియం వరకూ తీసుకెళ్లి స్పీకర్ చైర్లో కూర్చోబెట్టి పుష్పగుచ్ఛాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. ఆ తరువాత క్యాబినెట్ మంత్రులు ఒక్కొక్కరుగా పోడియం వద్దకు వెళ్లి స్పీకర్కు శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, దానం నాగేందర్, పల్లా రాజేశ్వర్ రెడ్డి తదితరులు కరచాలనం చేస్తూ అభినందనలు అందజేశారు.గడ్డం ప్రసాద్ రాజకీయ ప్రస్థానాన్ని ఒక్క సారి పరిశీలించినట్లయితే ఎంపీటీసీగా తొలి అడుగు వేసి.. నేడు శాసనసభాపతిగా ఎన్నికయ్యారు. ఈయన 21 ఏళ్ల ప్రాయంలోనే రాజకీయాల్లోకి వచ్చారు. ఈయన 1964లో మర్పల్లిలో జన్మించారు. 1984లో ఇంటర్మీడియట్ పూర్తి చేసి 2008 ఉపఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచారు. వికారాబాద్లో అఖండ విజయాన్ని సాధించారు. 2009లో మరోసారి ఎమ్మెల్యేగా విజయం తన ఖాతాలో వేసుకొని 2012లో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి కేబినెట్లో మంత్రిగా పనిచేశారు. 2014, 2018 ఎన్నికల్లో వరుసగా ఓటములు చవిచూడాల్సి వచ్చింది. 2022లో టీపీసీసీ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడిగా గడ్డం ప్రసాద్ను నియమించారు. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వికారాబాద్ నుంచి పోటీలో నిల్చొని మరోసారి గెలుపొందారు.స్పీకర్గా గడ్డం ప్రసాద్కుమార్ అభ్యర్థిత్వానికి బీజేపీకి మినహా మిగిలిన అన్ని పార్టీల మద్దతు లభించింది. ఆయనకు 63 మంది కాంగ్రెస్ సభ్యులు, 39 మంది బీఆర్ఎస్ సభ్యులు, ఏడుగురు ఎంఐఎం, సీపీఐకి చెందిన ఒక ఎమ్మెల్యే మద్దతు లభించినట్టయ్యింది. దీంతో ఏకగ్రీవంగా ఎన్నికై సభాపతి స్థానంలో కూర్చున్నారు గడ్డం ప్రసాద్.

## విద్యార్థులం, నిరుద్యోగులం పోలీసులతో నిందితులు



న్యూఢిల్లీ, డిసెంబర్ 14

లోక్సభపై దాడికి దాదాపు కొన్ని నెలల ముందుగానే ప్లాన్ చేసినట్టు ఢిల్లీ పోలీసులు వెల్లడించారు. మొత్తం ఆరుగురు నిందితులు ఈ స్కెచ్ వేసినట్టు వెల్లడించారు. వీరిలో ఐదుగురిని అరెస్ట్ చేశారు. మరొకరి కోసం గాలిస్తున్నారు. అయితే...అదుపులో ఉన్న ఐదుగురినీ విచారించగా కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ దాడికి కారణాలేంటో ఆ నిందితులు వివరించినట్టు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. కేంద్ర ప్రభుత్వం దృష్టిని తమవైపు మరల్చడంతో పాటు కొన్ని కీలస సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలన్న ఉద్దేశంతోనే ఈ దాడి చేసినట్టు వాళ్లు అంగీకరించినట్టు సమాచారం. నిరుద్యోగం, రైతుల సమస్యలు, మణిపూర్ హింస లాంటి అంశాల్పై ఆ నిందితులు తీవ్ర అసహనం వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. కావాలనే కలర్ స్మోక్ని సభలో వదిలామని, అలా అయినా తమ సమస్యలేంటో ప్రభుత్వం తెలుసుకుని వాటిపై చర్చిస్తుందన్న ఉద్దేశంతో ఇలా చేశామని తెలిపారు. "వాళ్లు కొన్ని సమస్యల విషయంలో తీవ్ర అసహనంతో ఉన్నారు. ఎలాగైనా ప్రభుత్వం దృష్టికి ఈ సమస్యల్ని తీసుకెళ్లాలని అనుకున్నారు. అందుకే ఇలా దాడి చేశారు. భద్రతా ఏజెన్సీలు మాత్రం ఈ దాడి వెనకాల ఇంకేదైనా కుట్ర ఉందా అన్న కోణంలో విచారణ చేపడుతున్నాయి. ఎవరైనా వీళ్లను ప్రేరేపించి దాడి చేయించారా అన్న కోణంలోనూ విచారణ జరగనుంది". మిగతా 2 లో


## బీజేఎల్పీ నేత ఎవరు..?

హైదరాబాద్, డిసెంబర్ 14 :

అసెంబ్లీ సమావేశాల వేళ.. సభలో కాంగ్రెస్ పార్టీకి రేవంత్ నాయకత్వం వహిస్తుండగా, BRSLP నేతగా కేసీఆర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అయితే, ఇప్పటి వరకూ బీజేపీ శాసనసభ పక్ష నేత ఎంపికపై మాత్రం క్లారిటీ రాలేదు. BJPLP నేత కోసం.. కమలంలో కసరత్తు కొనసాగుతునే ఉంది. బీజేపీ శాసన సభాపక్ష నేత పదవి కోసం... ప్రధానంగా ముగ్గురు నేతలు పోటీ పడుతున్నారు.అసెంబ్లీ సమావేశాల్లో కేవలం సాంప్రదాయ బద్ధంగానే సమావేశాల్లో పాల్గొనేందుకు సిద్ధం అవుతుంది భారతీయ జనతా పార్టీ. బీజేపీ నుంచి కొత్తగా ఎన్నికైన శాసన సభ్యులు. కొత్త స్పీకర్ ఎన్నిక అవ్వగానే ప్రమాణ స్వీకారం చేయాలని భావిస్తున్నారు. అటు బీజేపీ పక్ష నేత ఎన్నిక విషయం లోనూ బీజేపీ నాయకత్వం ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఆరుగురు సభ్యులు కొత్తవారు కాగా, గోషామహాల్ ఎమ్మెల్యే రాజాసింగ్, నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి మాత్రమే గతంలో శాసనసభ్యులుగా అనుభవం ఉంది. పలు మార్లు గెలిచారు కాబట్టి ఈ ఇద్దరిలో ఒకరికి పక్ష నేతగా అవకాశం ఇవ్వనున్నట్టు సమాచారం. కాగా ఈ సమావేశాల్లో ప్రభుత్వ విధానాలపై స్పందించడంలో వేచి చూసే ధోరణిలో ఉంటూనే, పలు సూచనలు సలహాలు చేసే ఆలోచనలో బీజేపీ ఉన్నట్టు తెలుస్తోంది. ఢిల్లీ నుండి బీజేపీ జాతీయ నాయకత్వం వచ్చిన తరువాతే పలు అంశాల పై చర్చించి తదుపరి సమావేశాల్లో పూర్తి స్థాయిలో గళం విప్పనున్నట్టు తెలుస్తోంది.




## ఇవాళ కేసీఆర్ డిశ్చార్జి



హైదరాబాద్, డిసెంబర్ 14

బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ క్రమంగా కోలుకుంటున్నారు. ఇంట్లో జారిపడిన ఘటనలో తుంటి ఎముక విరిగిపోవడంతో శస్త్రచికిత్స చికిత్స చేశారు హైదరాబాద్ యశోద ఆసుపత్రి వైద్యులు. ఆ తర్వాత నుంచి కేసీఆర్ వైద్యుల పర్యవేక్షణలోనే ఉన్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం కాస్త కుదుటపడటంతో ఇంటికి వెళ్లేందుకు వైద్యులు అనుమతించారు. శుక్రవారం ఆయన్ను డిశ్చార్జ్ చేయనున్నారు. ఆ తర్వాత కేసీఆర్ ఆసుపత్రి నుంచి ఆయన నేరుగా నందినగర్ లోని తన నివాసానికి వెళ్లనున్నారు. మరోవైపు కేసీఆర్ ఆరోగ్యం మిగతా 2 లో

jayabheridaily.com
ప్రభాత జయభేరి

▶▶ మొదటిపేజీ తరువాయి

## అసెంబ్లీ ఫైట్

తెలంగాణ ఎన్నికల ఫైట్ ముగిసింది. ఆ ఫైట్ లో కాంగ్రెస్ ను అధికార పార్టీగా కూర్చోబెట్టిన ఓటర్లు, అధికారంలో ఉన్న బీఆర్ఎస్ కు ప్రతిపక్ష హోదా కట్టబెట్టారు. ఇప్పుడు ఆ రెండు పార్టీల స్థానాలు మారినా ఫైట్ మాత్రం కామనే. అయితే ఇప్పుడు నిన్న మొన్నటిదాకా సాగిన ఎన్నికల సమరం కాస్తా అసెంబ్లీ ఫైట్ గా మారనుంది. ఈ అసెంబ్లీ సమావేశాల్లో అధికార పార్టీ 64 మంది సభ్యులతో, ఒక్క సీపీఐ ఎమ్మెల్యే మద్ధతుతో, ప్రతిపక్ష పార్టీగా ఉన్న బీఆర్ఎస్ ను ఎదుర్కొనేందుకు సిద్ధమవుతోంది. మరో వైపు 39 ఎమ్మెల్యేలతో గులాబీ పార్టీ, 8 మంది ఎమ్మెల్యేలతో కమలం పార్టీ, 7 గురు ఎమ్మెల్యేలతో ఎం.ఐ.ఎం పార్టీ ఈ కొత్త అసెంబ్లీలో కొలువు తీరనున్నాయి. ఇవన్నీ కాంగ్రెస్ టార్గెట్ గా పని చేయనున్నాయి.తెలంగాణ తెచ్చిన పార్టీగా టీఆర్ఎస్ గత రెండు ఎన్నికల్లో (2014, 2018) పోటీ చేసి అధికార పక్షంగా అసెంబ్లీలో వ్యవహరించింది. రెండో టర్మ్ లో బీఆర్ఎస్ కు ప్రతిపక్ష పార్టీయే లేని పరిస్థితి. 2014లో కాంగ్రెస్, టీడీపీలో మెజార్టీ ఎమ్మెల్యేలు అప్పటి టీఆర్ఎస్ పార్టీలో చేరారు. దీంతో అధికార పార్టీ హోదాలో ఉన్న టీఆర్ఎస్ కు అసెంబ్లీలో ఎదురే లేని పరిస్థితి. అయితే శాసన మండలిలో మాత్రం విపక్షాల సభ్యులు ఎక్కువ ఉండటంతో ఆయా అంశాలపై ఎక్కువ సమయం చర్చ జరిగేది. కాని శాసన సభలో మాత్రం ఏకపక్ష చర్చ సాగేది. 2018లోను అదే పరిస్థితి. 2018లోను కాంగ్రెస్ ది అదే పరిస్థితి. రేవంత్ రెడ్డి, జానారెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి వంటి నేతలు ఆ ఎన్నికల్లో ఓడిపోగా, భట్టి విక్రమార్క, కోమటి రెడ్డి వెంకటరెడ్డి, శ్రీధర్ బాబు వంటి నేతలు కొంత ప్రయత్నించినా అధికార పార్టీని నిలదీసే పరిస్థితి ఏ మాత్రం లేదు. టీడీపీ పూర్తిగా కనుమరుగయింది. వామపక్షాలదీ అదే పరిస్థితి. బీజేపీ ఒక్క సభ్యుడు మాత్రమే గెలిచినా, చివరకు వారి బలం ముగ్గురికి చేరుకుంది. కాని అధికార టీఆర్ఎస్ కు మాత్రం ఏ పార్టీ ఇబ్బంది పెట్టలేని పరిస్థితి ఉండేది. కాస్తో కూస్తో మిత్రపక్షంగా ఉన్న ఎం.ఐ.ఎం పార్టీనే ప్రజా సమస్యలపై, ఓల్డ్ సిటీ అభివృద్ధిపై కేసీఆర్ నాయకత్వంలోని ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టే పరిస్థితి ఉండేది. కాని ఈ దఫా 39 సభ్యులతో బీఆర్ఎస్ ప్రతిపక్షంగా ఉంది. ప్రజా సమస్యలపై కాంగ్రెస్ ను దూకుడుగా ప్రశ్నించే అవకాశం ఉంది. ఈ దఫా అధికార పార్టీకి అసెంబ్లీలో కొంత ప్రతిఘటన పెద్ద ఎత్తున ఉండే అవకాశం ఉంది.అసెంబ్లీలో అధికారపార్టీ కాంగ్రెస్ స్పీడ్ కు బ్రేకులు తప్పవు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ 39 అభ్యర్థులను గెలిపించి ఓటర్లు అసెంబ్లీకి పంపారు. దీంతో రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి అసెంబ్లీ సమావేశాల్లో ఆ పార్టీని ఎదుర్కోవడం అంత సులువేం కాదు. 39 మంది ఎమ్మెల్యేలతో బీఆర్ఎస్ గట్టి ప్రతిపక్ష పాత్ర పోషించే అవకాశం ఉంది. వీరితో పాటు 8 మంది బీజేపీ ఎమ్మెల్యేలు, 7 ఎం.ఐ.ఎం ఎమ్మెల్యేలు అధికార కాంగ్రెస్ పార్టీకి ఇబ్బందులు సృష్టించే అవకాశాలు లేకపోలేదు.ఎమ్మెల్యేగా, మంత్రిగా, డిప్యూటీ స్పీకర్ గా, మహబూబ్ నగర్, మెదక్, కరీంనగర్ స్థానాలకు ఎంపీగా, కేంద్ర మంత్రిగా, రెండు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన కేసీఆర్ ఈ మారు కొత్త పాత్ర పోషించనున్నారు. తెలంగాణ శాసన సభలో ప్రతిపక్ష నేత హోదాతో కేసీఆర్ అసెంబ్లీలో అడుగు పెట్టనున్నారు. బీఆర్ఎస్ ఎల్పీ సమావేశంలో కేసీఆరే ఎల్పీ లీడర్ గా ఎమ్మెల్యేలు ఎన్నుకున్న విషయం తెలిసిందే. అయితే తన ఫాం హౌస్ లో కేసీఆర్ జారి పడటం, తుంటి భాగం విరగడంతో ఆయన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆపరేషన్ జరగడంతో దాదాపు మరో నెల రోజుల పాటు కేసీఆర్ బయటకు రావడం సాధ్యపడని పరిస్థితి నెలకొంది. అయితే ఈ అసెంబ్లీ సమావేశాల్లో కేసీఆర్ ప్రతిపక్ష నేతగా అసెంబ్లీలో అడుగుపెట్టనప్పటికీ రానున్న రోజుల్లో జరిగే సమావేశాల్లో మాత్రం కేసీఆర్ ను ప్రతిపక్ష నేత పాత్రలో ప్రజలు చూసే అవకాశం ఉంది. గతంలో ఎన్నడూ పోషించని భిన్నమైన బాధ్యతను కేసీఆర్ నిర్వర్తించనున్నారు. విపక్ష నేతగా ,సీఎంగా రేవంత్ రెడ్డి ఉన్న సభ ఎలా జరగనుందో అన్న ఆసక్తి అందరిలో నెలకొంది. అయితే ఈ సమావేశాల్లో మాత్రం ఆ కోరిక తీరే అవకాశం మాత్రం లేదు. అయితే ఈ సమావేశాల్లోనే బీఆర్ఎస్ ఎల్పీ ఉపనేత, విప్ ల ఎంపిక జరుగుతుందా లేదా వేచి చూడాలి. ఈ సభలో మాత్రం ఆపార్టీ నుండి కేటీఆర్, హరీశ్ రావు, కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాస్ రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్ వంటి సీనియర్ నేతలు అసెంబ్లీలో కీలకపాత్ర పోషించనున్నారు.ఈ అసెంబ్లీ సమావేశాలు వాడి వేడిగా జరిగే అవకాశాలున్నాయి. అధికార కాంగ్రెస్ ను ఇరుకున పెట్టేందుకు బీఆర్ఎస్, గత పదేళ్లుగా అధికార పార్టీగా పాలన సాగించిన బీఆర్ఎస్ ను ఎదుర్కొనేందుకు కాంగ్రెస్ వ్యూహ ప్రతివ్యూహాలు పన్నుతున్నాయి. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుపై బీఆర్ఎస్ కాంగ్రెస్ ను పట్టుపట్టే అవకాశం ఉంది. అంతేకాకుండా ఇష్టారీతిన కాంగ్రెస్ పార్టీ ప్రజలకు హామీలు ఇచ్చిందని అందుకు నిధులు ఎలా తెస్తారో.. ఎంత ఖర్చు అవుతుందో లెక్కలు చెప్పాలని ప్రతిపక్షాలు ప్రశ్నించే అవకాశం ఉంది. ఆరు గ్యారంటీల పథకాలపై విస్తృతంగా చర్చ జరిగే అవకాశం ఉంది. ఇక కాంగ్రెస్ పార్టీ సైతం రాష్ట్రంలో పదేళ్లుగా సాగిన గులాబీ పాలనపైన విమర్శలు ఎక్కుపెట్టే అవకాశం ఉంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, అప్పులపైన ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేసి బీఆర్ఎస్ ను ఇరుకునపెట్ట వచ్చని తెలుస్తోంది. అప్పులు చేసిన తీరుపైన , విద్యుత్ కొనుగోళ్లు, కాళేశ్వరం ప్రాజెక్టుపైన బీఆర్ఎస్ ను కార్నర్ చేసేందుకు కాంగ్రెస్ సిద్ధమవుతోంది. మరో వైపు బీజేపీ, ఎం.ఐ.ఎంలు సైతం అధికార కాంగ్రెస్ టార్గెట్ గానే అసెంబ్లీలో వ్యూహాలు ఉంటాయని తెలుస్తోంది. ఏది ఏమైనా అధికార విపక్ష పార్టీల మధ్య జరిగే ఫైట్ కు అసెంబ్లీ వేదిక కానుంది.

## ఇవాళ కేసీఆర్ డిశ్చార్జి

నిలకడగా ఉందని.. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని డాక్టర్లు తెలిపారు.తన ఫామ్ హౌస్ లోని బాత్రూమ్లో ప్రమాదవశాత్తు కాలు జారి పడటంతో కేసీఆర్ తుంటి ఎముక విరిగింది. యశోద ఆసుపత్రి వైద్యులు ఆపరేషన్ నిర్వహించి తుంటి ఎముకను రిప్లేస్ చేశారు. ఆసుపత్రిలో కేసీఆర్ ను రేవంత్ రెడ్డి, చంద్రబాబు, చిరంజీవి, చిన్న జీయర్ స్వామి, ప్రకాశ్ రాజ్ తదితర ప్రముఖులు పరామర్శించారు. ఆయన యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. గత 6 రోజులుగా కేసీఆర్ను పరామర్శించే వారి సంఖ్య పెరుగుతోంది. ఈ పరిస్థితుల మధ్య కేసీఆర్ తాజాగా ఓ వీడియోను కూడా విడుదల చేశారు. తెలంగాణ సమాజాన్ని ఉద్దేశించి కేసీఆర్ ప్రసంగించారు. తనను పరామర్శించేందుకు ఎవరూ రావద్దని కోరారు.కేసీఆర్ అభ్యర్థన మేరకు కొద్ది రోజులుగా ఆస్పత్రి పరిసరాల్లో తగ్గిన అభిమానుల తాకిడి ఇప్పుడు నందీనగర్లోని ఆయన నివాస వద్ద పెరిగే అవకాశం ఉంది. తమ అభిమాన నాయకుడు ఎప్పుడెప్పుడు కోలుకొని తమ మధ్యకు వస్తారా అని కార్యకర్తలు, అభిమానులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు.హిప్ రీప్లేస్మెంట్ సర్జరీ చేయించుకున్న బీఆర్ఎస్ చీఫ్, మాజీ సీఎం కేసీఆర్ వాకర్ సాయంతో డాక్టర్ల పర్యవేక్షణలో నడుస్తున్నారు. హాస్పిటల్లోని తన రూమ్లో వాకర్తో కేసీఆర్ నడుస్తున్నారు. వేగంగా రికవర్ అవుతున్నారని తెలిపారు. బ్రీతింగ్ ఎక్సర్సైజ్లు చేయిస్తామని, ఆయన మెడికల్గా స్టేబుల్గా ఉన్నారని, నార్మల్ఫుడ్ తింటున్నారని చెప్పారు. మరికొన్ని రోజులు ఫిజియోథెరపీ చేయాల్సి ఉంటుందని, శరీరం ఇట్లాగే సహకరిస్తే వేగంగా ఆయన సొంతంగా నడిచే అవకాశం ఉంది. పరిస్థితి క్రమంగా మెరుగుపడుతూండటంతో ఇక ఆస్పత్రిలో ఉండాల్సిన అవసరం లేదని డాక్టర్లు భావిస్తున్నారు. ఆస్పత్రిలో ఉన్నప్పటికీ పెద్ద ఎత్తున పరామర్శించేందుకు ప్రముఖులు వస్తున్నారు. వారితో యశోదాలో రోగులకు ఇబ్బంది ఎదురవుతోంది. రావొద్దని కూడా కేసీఆర్ విజ్ఞప్తి చేశారు. కేసీఆర్కు ఆపరేషన్ నొప్పి తగ్గి, సాధారణ నొప్పి మాత్రమే ఉన్నదని, ఆయన శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉన్నారని వైద్యులు చెబుతున్నారు. సాధారణ ఆహారమే తీసుకుంటున్నారని పేర్కొన్నారు. బ్రీతింగ్ ఎక్సర్సైజ్లు కూడా చేయిస్తున్నామని చెప్పారు. మరికొన్ని రోజులు ఫిజియోథెరపీ కొనసాగించాల్సి ఉంటుందని ప్రకటించారు. వారం కిందట ఎర్రవల్లిలోని ఫామ్హౌస్లో కేసీఆర్ జారిపడటంతో ఆయన్ను సోమాజిగూడలోని యశోద హాస్పిటల్కు కుటుంబ సభ్యులు తరలించారు. సీటీ స్కాన్ చేసిన డాక్టర్లు.. తుంటి ఎముక విరిగినట్టుగా గుర్తించారు. శుక్రవారం ఉదయం ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహించి.. రాత్రి హిప్ రీప్లేస్మెంట్ సర్జరీ చేశారు. కేంద్రమంత్రిగా ఉన్న సమయమంలోనూ కేసీఆర్ ఓ సారి ఢిల్లీలో బాత్ రూంలో జారి పడ్డారు. దాంతో అప్పుడు కూడా ఆయనకు తుంటి ఆపరేషన్ జరిగింది. ఈ సారి రెండో వైపు ఆపరేషన్ జరిగింది. అయినా కేసీఆర్ మానసికంగా ధృడంగా ఉన్నారని.. ఆస్పత్రిలో పుస్తకాలు చదువుతున్నారని ఎంపీ సంతోష్ రావు తెలిపారు.


## పోలీసులతో నిందితులు

ఈ విచారణ సమయంలోనే నిందుతులు మరి కొన్ని కీలక విషయాలు వెల్లడించారు. ఎందుకు దాడి చేశారు..? ఎవరు దాడి చేయమని చెప్పారు అని ఢిల్లీ పోలీసులు ప్రశ్నించగా ఆసక్తికర సమాధానాలిచ్చారు. "మేం ఏ సంస్థకూ చెందిన వాళ్లం కాదు. మేం విద్యార్థులం, నిరుద్యోగులం. మా తల్లిదండ్రులు తోచిన పని చేసుకుని బతుకీడుస్తున్నారు. మాకు ఉద్యోగాల్లేవు. ప్రభుత్వంపై నిరసన వ్యక్తం చేయాలనుకుంటే మా గొంతు నొక్కేస్తున్నారు. అందుకే ఇలా చేశాం". దాదాపు 18 నెలలుగా ఈ దాడి కోసం ప్లాన్ చేస్తున్నట్టు విచారణలో తేలింది. అంతే కాదు. ఈ నిందితులంతా సోషల్ మీడియా పేజ్ Bhagat Singh Fan Club ని ఫాలో అవుతున్నారు. ఈ దాడి చేసే ముందు నిందితుల్లో కొందరు సోషల్ మీడియాలో మహిళా రిజర్వేషన్లు, ప్రజాస్వామ్యానికి సంబంధించిన పోస్టు పెట్టినట్టు పోలీసులు వెల్లడించారు. ఇన్స్టాగ్రామ్లో స్టోరీలు కూడా పెట్టారు.

# ముబారక్ మల్టీ క్యూసీన్ రెస్టారెంట్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే

**మేడ్చల్ :** మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్టీసీ కాలనీ జాతీయ రహదారి పై ఏర్పాటు చేసిన ముబారక్ మల్టీ క్యూసీన్ రెస్టారెంట్ ను గురువారం మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి లతో కౌన్సిలర్లు పాల్గొని రెస్టారెంట్ నిర్వాహకులను ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. ముబారక్ రెస్టారెంట్ యజమానులు మంత్రి మల్లారెడ్డి తో పాటు అతిథులందరికి శాలువలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్లారెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ బిర్యానీకి ఫేమస్ అని మేడ్చల్ బిర్యానీ కూడా అలాంటి పేరు తెచ్చుకోవలన్నారు. మేడ్చల్ రోజు రోజు కు అభివృద్ధి చెందుతున్నదని ఇక్కడ ఇలాంటి రెస్టారెంట్ అవశ్యకత ఉందన్నారు. ప్రజలు తమ దైనందిన జీవితంలో భాగంగా వారంలో ఒక సారైనా కుటుంబంతో కలిసి రెస్టారెంట్ కు వస్తారని వారిని దృష్టి లో పెట్టుకొని నాణ్యమైన ఆహారం అందించాలన్నారు. రెస్టారెంట్ నిర్వాహకులు ఆల్కఫ్, హజార్ లు మాట్లాడుతూ తమ వద్ద, ఇండియన్, చైనీస్,తందూరి, అన్నిరకాల వెజ్, నాన్ వెజ్ రుచికరమైన వంటకాలు సరసమైన ధరలకు అందుబాటులో ఉన్నాయని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రమణ రెడ్డి, మున్సిపల్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాఘవేందర్ గౌడ్, మురళి గౌడ్, బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు శేఖర్ గౌడ్, బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రామస్వామి ముదిరాజ్, మాజీ ఉప సర్పంచ్ నర్సింహారెడ్డి, వైస్ చైర్మన్ చీర్ల రమేష్, కౌన్సిలర్లు తుడుం గణేష్, మర్రి శ్రీనివాస్ రెడ్డి, దేవరాజ్, శివ కుమార్ కో ఆప్షన్ మెంబెర్లు నవీన్ రెడ్డి, మహమ్మద్ అలీ, రఫిక్ నాయకులు శ్రావణ్ కుమార్, రవీందర్ రెడ్డి, రవీందర్, మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





# మెడిసిటీ హాస్పిటల్ మేడ్చల్ వారి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం

**వర్గల్ :** వర్గల్ మండలం, తుంకి ఖల్సా గ్రామ సర్పంచ్ సంధ్య జానీ ఆధ్వర్యంలో గురువారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించడము జరిగినది. ఈ వైద్య శిబిరంలో బీపీ, షుగర్ పరీక్షలు, కంటి పరీక్షలతో పాటు, చెవి, ముక్కు, గొంతు, వరిబీజము, బీజకుట్టు, గడ్డలు, కనతులు, థైరాయిడ్ గడ్డలు, గర్భ సంచికి సంబంధించిన సమస్యలు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, చర్మ సమస్యలు, మోకాళ్ళ నొప్పులు, నడుము నొప్పులు, ఊపిరితిత్తుల సమస్యలు చూసి మందులు ఉచితంగా పంపిణీ చేయడం జరిగింది.
ఈ కార్యక్రమములో యం పి టీ సి జనార్దన్, గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, కార్యదర్శి ప్రశాంత్, కారోబార్ నాగేష్, ప్రజలు పాల్గొనడము జరిగింది. ఈ వైద్య శిబిరంలో 106 మందికి షుగర్, బీపీ, టెస్టులు చేయడం జరిగినది. ఆపరేషన్ అవసరము ఉన్న వాళ్ళ 33 మందిని రిఫర్ రాయడం జరిగింది. వీరిని మెడిసిటీ హాస్పిటల్ కు తరలించి ఉచిత ఆపరేషన్లు చేయడం జరుగుతుంది. ఈ వైద్య శిభిర కార్యక్రమంలో డాక్టర్లు నిశాత్, హర్షిని, రవితేజ, చేతన్, మార్కెటింగ్ ఇంచార్జి కుమారస్వామి, బాలకృష్ణ , సత్యనారాయణ, సాత్విక పాల్గొనడం జరిగింది.












# బాధ్యతలు స్వీకరించిన మంత్రులు

**హైదరాబాద్, డిసెంబర్ 14**
తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చింది. అందులో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు సీఎం రేవంత్ రెడ్డి. తాజాగా మహాలక్ష్మి పథకం ఉచిత బస్సు పథకానికి సంబంధించిన నిధుల విడుదలపై డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క మొదటి సంతకం చేశారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ పై రెండవ సంతకం చేశారు. రాష్ట్ర సచివాలయంలో ఆర్థిక, ప్రణాళిక, విద్యుత్ మంత్రిత్వ శాఖల బాధ్యతలు స్వీకరించారు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. వేద పండితుల మంత్రాల మధ్యలో తన ఛాంబర్లోకి ప్రవేశించారు. ఆ తరువాత తన కుర్చీలో కూర్చొని కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీల అమలులో భాగంగా మహాలక్ష్మి పథకం సంబంధించిన ఫైళ్లను అందజేశారు కార్యదర్శులు. మహిళలకు కల్పిస్తున్న ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం సబ్సిడీని 374 కోట్ల రూపాయలు ఆర్టీసీకి విడుదల చేస్తూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తొలి సంతకం చేశారు.రాజీవ్ ఆరోగ్యశ్రీ సాయాన్ని 10 లక్షలకు పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా 298 కోట్ల రూపాయలను వైద్య ఆరోగ్య శాఖకు విడుదల చేస్తూ రెండవ సంతకం చేశారు. విద్యుత్ సబ్సిడీ 996 కోట్ల రూపాయలు విడుదల ఫైలు పై మూడో సంతకం చేశారు. సమ్మక్క సారక్క జాతర ఏర్పాట్ల కొరకు 75 కోట్ల రూపాయలు వివిధ శాఖల మంజూరుకు సిఫారసు చేసిన ఫైలుపై నాలుగో సంతకం చేశారు. ఇలా చెప్పిన ఆరు గ్యారెంటీలలో ఒక్కొదానికి అవసరమైనన్ని నిధులను విడుదల చేస్తూ పథకాలకు ఎలాంటి ఆటంకాలు కలుగకుండా సాఫీగా కొనసాగించేందుకు తగు కార్యాచరణను రూపొందిస్తున్నారు.





### వార్నింగ్ ఇచ్చిన శ్రీధర్ బాబు

ఐటీ, పరిశ్రమలు, వాణిజ్య శాఖ మినిస్టర్గా దుద్దిళ్ల శ్రీధర్బాబు బాధ్యతలు స్వీకరించారు. ఉదయం 9 గంటల సమయంలో తన ఛాంబర్లో శాస్త్రోక్తంగా తన సీట్లు కూర్చున్నారు. అనంతరం బాధ్యతలు తీసుకున్న ఫైల్పై సంతకాలు చేశారు. బాధ్యతలు స్వీకరించిన తర్వాత అధికారులతో సమావేశమయ్యారు. తొలి సమావేశంలోనే అధికారులకు సీరియస్ వార్నింగ్ ఇచ్చారు శ్రీధర్బాబు. ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేసేలా లీకులు ఇస్తే మాత్రం సహించేది లేదని చెప్పేశారు. ఈ మధ్యకాలంలో ఓ కంపెనీ తెలంగాణ నుంచి వెళ్లిపోతోందని ప్రధాన మీడియాలో వార్తలు వచ్చాయి. దీన్ని అవకాశంగా తీసుకున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రచారం మొదలైపోయింది. దీంతో ప్రభుత్వం ఇలాంటి విషయంలో సీరియస్గా ఉండాలని చూస్తోంది. అందుకే ఇలాంటి లీకులు ఇవ్వొద్దని అధికారులకు సూచించారు శ్రీధర్బాబు. ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేసే పోస్టులు కానీ, తప్పుగా ప్రొజెక్టు చేసే వీలు అసలు ఇవ్వొద్దని అన్నారు. కావాలనే తప్పుడు ప్రచారం చేస్తే మాత్రం ఉపేక్షించవద్దని చెప్పారట. కఠినంగా వ్యవహరించాలని తెలిపారు. హైదరాబాద్లో తన ప్లాంట్ను స్థాపించేందుకు ఆసక్తి చూపిన కార్నింగ్ సంస్థ చెన్నైకు తరలిపోతుందనే వార్త సోషల్ మీడియాలో తెగ వైరల్ అయింది. దీంతో కాంగ్రెస్ వ్యతిరేకంగా పని చేసే వాళ్లంతా రెచ్చిపోయి పోస్టులు పెట్టారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే వచ్చిన భారీ మార్పు అంటూ సోషల్ మీడియాలో సెటైర్లు పేల్చారు. దీనిపై ప్రభుత్వం ఇంత వరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు కానీ ఇప్పుడు బాధ్యతలు స్వీకరించిన శ్రీధర్బాబు మాత్రం అధికారులకు వార్నింగ్ ఇచ్చారు.

# భూ కబ్జాలకు పాల్పడిన మాజీ మంత్రి అరెస్ట్ చేయండి

**జయభేరి, ముడుచింతల పల్లి, డిసెంబర్ 14 :**

గిరిజన భూములు గిరిజనులకే ఇప్పిస్తానని మాయ మాటలు చెప్పి అక్రమంగా మాజీ మంత్రి మల్లారెడ్డి కబ్జా చేయడం అప్రజాస్వామ్యం అని తక్షణమే మాజీ మంత్రి మల్లారెడ్డిని అరెస్టు చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్ బాల మల్లేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సిపిఐ, వ్యవసాయ కార్మిక సంఘం, గిరిజన సమాఖ్య ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లా ముడుచింతల పల్లి మండలంలోని కేశవరం గ్రామంలో మాజీ మంత్రి కబ్జా చేసిన భూములను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్ బాల మల్లేష్ మాట్లాడుతూ.. మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా మూడు చింతలపల్లి మండలంలోని కేశవరం గ్రామంలో సర్వే నెంబర్ 34, 33, 35 లోని సుమారు 47 ఎకరాల 18 గుంటల గిరిజనుల భూములను మల్లారెడ్డి అక్రమంగా కబ్జా చేయడం అన్యాయమని పేర్కొన్నారు. అప్పటి ప్రభుత్వానికి రెవెన్యూ యంత్రాంగం రాత్రికి రాత్రి గిరిజన భూములు అక్రమంగా రిజిస్టర్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై అటు ప్రజలు ఇటు మీడియా ప్రశ్నించిన కూడా అధికారులు పట్టించుకోకుండా మాజీ మంత్రి మల్లారెడ్డి ప్రోత్బలంతో రిజిస్ట్రేషన్ చేశారని ధ్వజమెత్తారు.పాలమ్మిన, పూలమ్మిన కష్టపడ్డ సక్సెస్ అయ్యా అని





సోషల్ మీడియాలో గొప్పలు చెప్పుకునే మాజీ మంత్రి మల్లారెడ్డి అసలు నైజం బయటపడిందని నిరుపేదలు, బడుగు బలహీన వర్గాలు, దళితుల భూములను కబ్జాలు చేస్తూ కోట్లకు పరిగెత్తారని ఆరోపించారు. ఇప్పటికైనా మల్లారెడ్డి భూకబ్జాలపై కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రేవంత్ రెడ్డి సమగ్ర విచారణ జరిపి దీనికి బాధ్యులైన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని, అదే విధంగా గిరిజనుల భూములు గిరిజనులకు ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా సిపిఐ కార్యదర్శి డి జి సాయిల్ గౌడ్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఉమా మహేష్‌లు మాట్లాడుతూ పేద గిరిజన భూములు గిరిజనులకే దక్కాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనియెడల పేదల భూములు దక్కేవరకు పోరాటాలు కొనసాగిస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి శంకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్ కృష్ణమూర్తి, వి హరినాథరావు ముడు చింతలపల్లి మండల కార్యదర్శి టి రామారావు గౌడ్, గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి స్వరూప, నాయకులు అజిత్, శ్రీకాంత్ యాదవ్, దుర్గం వెంకటేష్, బి వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ను పరామర్శించిన పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ జక్క వెంకట్ రెడ్డి. యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ను పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్ రెడ్డి కలిసి పరామర్శించారు. కేసీఆర్ ను ఆప్యాయంగా పలకరించి యోగక్షేమాలు అడిగి తెలుసుకొని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

**జయభేరి, ఉప్పల్**



## నూతన భవనం ప్రారంభం

**జయభేరి, తుర్కపల్లి, డిసెంబర్ 14 :**

మేడ్చల్ జిల్లా తుర్కపల్లి లోని జినోమ్ వ్యాలీలో నూతనంగా నిర్మించిన ICMR NITM బెల్గవి భవనాన్ని యూనియన్ మినిస్టర్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డాక్టర్ మన్ సుఖ్ మండవియ ప్రారంభించారు. అధునాతనంగా నిర్మించిన ఈ భవనములో అన్ని వసతులు కల్పించినట్లు, ఆయన వివరించారు.




## స్పీకర్ ముందు ప్రమాణం చేసిన బీజేపీ ఎమ్మెల్యేలు

**హైదరాబాద్, డిసెంబర్ 14**

ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్ ముందు ప్రమాణం చేయమని ముందే చెప్పామని, ఆ మాటకు కట్టుబడి ఉన్నామని గోషామహల్ ఎమ్మెల్యే రాజసింగ్ అన్నారు. గురువారం అసెంబ్లీ సమావేశాలకు రాష్ట్ర బీజేపీ ఎమ్మెల్యేలు హాజరయ్యారు. సందర్భంగా అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ బీజేపీ ఎమ్మెల్యేలందరూ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ముందు ప్రమాణం చేశామన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటిలతో అధికారంలోకి వచ్చిందని ఆయన అన్నారు. రాష్ట్రాన్ని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అప్పుల పాలు చేసి వెళ్ళిపోయారన్నారు. ఇచ్చిన గ్యారెంటీలను కాంగ్రెస్ పార్టీ ఏ విధంగా అమలు చేస్తుందని ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీలకు నిధులు కాంగ్రెస్ పార్టీ ఆఫీస్ నుంచి తెస్తారా? లేక ఇటలీ నుంచి తెస్తారా...? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని.. ఆ పార్టీపై తమ యుద్ధం మొదలైందని రాజసింగ్ పేర్కొన్నారు.అనంతరం బీజేపీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, హామీల అమలు జరిగే వరకు ప్రజల పక్షాన నిలబడతామని వ్యాఖ్యానించారు. మహేశ్వర్ రెడ్డి ప్రగతి భవన్ను స్టడీ సర్కిల్గా మారుస్తామని హామీ ఇచ్చి మరిచారన్నారు. రైతు బంధులో కోత విధించడం సరైంది కాదన్నారు.

## ఎం ఎల్ ఏ గా పద్మరావు గౌడ్ ప్రమాణము



**సికింద్రాబాద్, డిసెంబర్ 14**

సికింద్రాబాద్ ఎం ఎల్ ఏ తీగుల్ల పద్మరావు గౌడ్ గురువారం అసెంబ్లీ లో ఎం ఎల్ ఏ గా ప్రమాణం చేశారు. ఎం ఎల్ ఏ గా ప్రోటెం స్పీకర్ అక్బరుద్దీన్ ఒవైసీ ఆయనతో ప్రమాణం చేయించారు. 2014 నుంచి వరుసగా మూడో సారి ఎం ఎల్ ఏ గా ఎన్నికై సికింద్రాబాద్ లో హ్యాట్రిక్ సాధించిన పద్మారావు గౌడ్ తొలుత 2004 లో ఎం ఎల్ ఏ గా ఎన్నికయ్యారు. అప్పటి ఎన్నికల్లో ఆయనను 3067 ఓట్ల మెజారిటీ లభించింది. తెలంగాణ కోసం రాజీనామా చేసిన అయన ఆ ఉప ఎన్నికల్లో విజయం సాధించలేదు.అనంతరం 2014, 2018, 2023ల్లో వరుసగా ఎం ఎల్ ఏ గా ఎన్నికయ్యారు. ప్రతి ఎన్నికల్లో ఆయన సాధించిన మెజారిటీ పెరుగుతూ తాజాగా 45,240 ఓట్ల ఆధిక్యతను సాధించి సికింద్రాబాద్ లో హ్యాట్రిక్ తో ఎం ఎల్ ఏ రికార్డు ను నెలకొల్పారు.ఈ సందర్భంగా అయన ను నియోజకవర్గం లో పలువురు అభినందనలు తెలిపారు

## మంత్రులకు శుభాకాంక్షలు

**రేగొండ :**

జాతీయ మాలమహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ జెల్ల ప్రభాకర్ ఆధ్వర్యంలో మంత్రులకు శుభాకాంక్షలు తెలంజేయడం జరిగింది. Dr. BR అంబేద్కర్ సచివాలయంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పంచాయతీ రాజ్ శాఖ, శిశు సంక్షేక శాఖ మంత్రి ధనసరి సీతక్క, జాతీయ మాలమహానాడు అధ్యక్షులు అద్దంకి దయాకర్ లను మర్యాదకపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ జెల్ల ప్రభాకర్, జయశంకర్ జిల్లా రేగొండ మండల అధ్యక్షులు మండల తిరుపతి, గోరి కొత్తపెల్లి మండలం చిన్నకోడేపాక సర్పంచ్ గుండు సదానందం, పెరుమాండ్ల రమేష్, బండారి చెంద్రమౌళి, పప్పుల చెంద్రమౌళి తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలంజేయడం జరిగింది.







## రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఎంపికైన విద్యార్థులకు సన్మానం

**జయభేరి, డిసెంబర్ 14 :**

హైదరాబాద్ పరిధిలోని నాదర్ గుల్ గల ఢిల్లీ పబ్లిక్ పాఠశాలలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా SGFI ఆధ్వర్యంలో జిల్లా స్థాయి హాకీ పోటీలు నిర్వహించారు. ఈ కాగా ఈ పోటీల్లో మేడ్చల్ జిల్లా తుర్కపల్లి లోని సెయింట్ మేరీస్ సెంట్రల్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు అధ్యాపక బృందం అభినందన సభ ఏర్పాటు చేసి సన్మానించారు. అండర్ 14 విభాగంలో టీ. సాహితీ, E. నిహారిక. M. శ్రీ వర్ధన్, A. షివేంద్ర, A. దుర్గేష్, మరియు అండర్ 17 విభాగంలో CH. అంజన శ్రీ, A. కీర్తన, B. వైష్ణవి, G. ప్రదీప్ రెడ్డి, V. మణిదీప్, జశ్వంత్ లు రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఎంపిక అయినట్లు వారు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ వరప్రసాద్ రెడ్డి, మరియు ఇంచార్జ్ సౌజన్య, గ్రేస్, పిఈటీ అన్వర్, మురళి, తదితరులు పాల్గొన్నారు.






బోడుప్పల్ నగర పాలక సంస్థ యందలి 15వ డివిజన్ లోని అయోధ్య నగర్ కాలనీ ముఖద్వార భూమిపూజ కార్యక్రమం మేయర్ సామల బుచ్చిరెడ్డి చేతుల మీదుగా జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ అధ్యక్షులు మంద సంజీవ రెడ్డి, 15వ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి సిగురు రేణుక రవికుమార్, పార్టీ సీనియర్ నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

**జయభేరి, మేడిపల్లి**





## స్పీకర్ కు శుభాకాంక్షలు తెలియచేసిన యూత్ కాంగ్రెస్ నేతలు

**జయభేరి, తుంకుంట, డిసెంబర్ 14:**

అసెంబ్లీ స్పీకర్ గా గడ్డం ప్రసాద్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నిక కావడం హర్షణీయం అని తుంకుంట మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భీమిడి జైపాల్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుంకుంట జగదీష్ గౌడ్ లు అన్నారు. ఈ సందర్భంగా వారు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఒక ఎంపిటిసి స్థాయి నుండి అంచెలంచెలుగా స్పీకర్ స్థాయికి ఎదగడం సంతోషం గా ఉందని, ఆయన భవిష్యత్తు లో మరిన్ని పదవులు అధిరోహించాలని కోరారు. అదేవిధంగా స్పీకర్ గా అధికార, ప్రతిపక్ష బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని కోరారు.




## మల్లారెడ్డి మహిళా కళాశాలలో స్పోర్ట్స్ మీట్

**మేడ్చల్ :**

గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో స్పోర్ట్స్ మీట్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మాధవిలత తెలిపారు. టెక్ ట్రోఫీ 2023 పేరుతో రెండు రోజుల పాటు నిర్వహించనున్న స్పోర్ట్ మీట్ ను మల్లారెడ్డి గ్రూప్స్ డైరెక్టర్ శాలినీరెడ్డి ప్రారంభించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. క్రీడలతో విద్యార్థిణులు మానసికంగా, శారీరకంగా దృడంగా మారుతారని క్రీడాకారులు, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొననున్నట్లు తెలిపారు.

# రాక్షస రాజా కోసం మళ్ళీ కలిసిన కాంబో




పవర్హౌస్ యాక్టర్ రానా, క్రియేటివ్ డైరెక్టర్ తేజ వారి కాంబినేషన్ లో వచ్చిన "నేనే రాజు నేనే మంత్రి" బ్లాక్ బస్టర్ విజయం తర్వాత "రాక్షస రాజా"తో మరోసారి ప్రేక్షకులను అలరించడానికి సిద్ధంగా ఉన్నారు. గ్రిప్పింగ్ కథనం, పవర్ ఫుల్ పెర్ఫార్మెన్స్ లతో గొప్ప ప్రశంసలను పొందిన ఈ పవర్ ఫుల్ కాంబో రీయూనియన్ కోసం అభిమానులు, క్రిటిక్స్ ఆసక్తిగా ఎదురుచూశారు. వారి అంచనాలకు తగ్గట్టుగా "రాక్షస రాజా" ఇదివరకూ ఎన్నడూ చూడని క్రైమ్ వరల్డ్ ని ఎక్స్ ఫ్లోర్ చేస్తూ ఇంటెన్స్ ఎమోషన్స్ , ఫ్యామిలీ డ్రామా అద్భుతమైన సమ్మేళనం ఉండబోతుందని ప్రామిస్ చేస్తోంది. రానా పుట్టినరోజు సందర్భంగా ఈ టైటిల్ను పవర్ ఫుల్ పోస్టర్ ద్వారా అనౌన్స్ చేశారు.

ఇందులో రానా తన భుజంపై భారీ తుపాకీని పట్టుకుని మరో భుజంపై బుల్లెట్లతో కనిపించారు. విభూతి, తిలకం ధరించి, నోటిలో సిగార్తో వైల్డ్ గా కనిపించారు. వేళ్లకు రెండు పొడవాటి బంగారు ఉంగరాలు ఉన్నాయి. ఓవరాల్ గా రానా లుక్ అద్భుతంగా అలరిస్తోంది.ఈ గ్యాంగ్స్టర్ చిత్రంలో మునుపెన్నడూ లేని విధంగా సినిమాటిక్ జర్నీని ప్రేక్షకులు ఆశించవచ్చు.గ్రిప్పింగ్ కథనం, అద్భుతమైన పెర్ఫార్మెన్స్, వండర్ ఫుల్ విజువల్స్ తో "రాక్షస రాజా" తెలుగు సినిమా పరిశ్రమలో కొత్త బెంచ్మార్క్లను సెట్ చేయడానికి సిద్ధంగా ఉంది. అభిమానులు అంచనాలను మించి సినిమా అద్భుతంగా ఉండబోతుంది. త్వరలో మరిన్ని వివరాలు తెలియజేయనున్నారు.



# 'కన్నప్ప' హీరోయిన్ ప్రీతి ముకుందన్

ప్రస్తుతంభారతదేశంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న చిత్రం 'కన్నప్ప'. విష్ణు మంచు డ్రీమ్ ప్రాజెక్ట్ అయిన ఈ కన్నప్ప మీద దేశ స్థాయిలో అంచనాలు నెలకొన్నాయి. ఆల్రెడీ కన్నప్ప ఫస్ట్ లుక్ అందరినీ ఆకట్టుకుంది. ఇప్పుడు మేకర్స్ మరో ప్రకటన చేశారు. ఈ చిత్రంలో డైనమిక్ స్టార్ విష్ణు మంచు సరసన ప్రీతి ముకుందన్ నటించనున్నారు. ఈ మేరకు టీంలోకి ఆమెను స్వాగతించింది కన్నప్ప చిత్రయూనిట్. ప్రీతి నటించబోతున్న కీలక పాత్ర కోసం ఆడిషన్స్ నిర్వహించారు. ఎన్నో రకాల ఆడిషన్స్ తరువాత ప్రీతి ఈ పాత్రకు సరిగ్గా సరిపోతుందని చిత్రయూనిట్ భావించింది. విష్ణు మంచు, మోహన్లాల్, ప్రభాస్ వంటి వారు నటిస్తున్న ఈ కన్నప్ప మూవీతో ప్రీతి కెరీర్ లో మరో స్థాయికి వెళ్లనున్నారు. బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన ప్రీతి.. తన భరతనాట్య కళతో పాత్రకు ప్రాణం పోయనున్నారు. 'కన్నప్ప'లోని యాక్షన్ సీక్వెన్స్లతో పాటుగా ఆమె నృత్య నైపుణ్యం ప్రేక్షకులకు విజువల్ ట్రీట్గా ఉంటుంది. సరికొత్త సినిమాటిక్ ఎక్స్పరియెన్స్ ఇచ్చేలా కన్నప్పను తెరకెక్కిస్తున్నారు. దర్శకుడు ముఖేష్ కుమార్ సింగ్ మాట్లాడుతూ..'ప్రీతీకి ఇది తొలి సినిమా మాత్రమే కాదు. కళ, సినిమా రంగాల గురించి మరింత ఎక్కువగా నేర్చుకునే ప్రపంచంలోకి వచ్చింది. ఆమె ఈ పాత్రకు సరిగ్గా సరిపోతుంది. ఆమెతో కలిసి పనిచేయడానికి టీం అంతా ఎదురుచూస్తోంది' అని అన్నారు.



## ఫస్ట్ క్యారెక్టర్ పోస్టర్ లో ఇంటెన్స్ లుక్.. అడివి శేష్

అడివి శేష్, శృతి హాసన్ మెగా పాన్ఇండియా యాక్షన్ డ్రామా నుంచి మేకర్స్ గురువారం సెన్సేషనల్ ఫస్ట్ ఇమేజ్ ని విడుదల చేశారు. ఈ సినిమా టైటిల్ అడివి శేష్ గ్రిప్పింగ్ క్యారెక్టర్ రివీల్ పోస్టర్తో డిసెంబర్ 18న విడుదల కానుంది. ఫస్ట్ ఇమేజ్ లో తీక్షణమైన చూపులతో, ముఖాన్ని బ్లాక్ స్కార్ఫ్ తో కప్పుకొని చాలా ఇంటెన్స్ లుక్ లో కనిపించారు అడివి శేష్. అతని కుడి చెవిలో బంగారు చెవిపోగులు, అతని నుదిటిని కప్పి ఉన్న లాంగ్ లాక్స్ లుక్ కు స్టైల్, స్వాగ్ని జోడించాయి. ఈ చిత్రంలో హీరోయిన్ శృతి హాసన్ తన ఇన్స్టాగ్రామ్లో అడివి శేష్ ఫస్ట్ లుక్ చిత్రాన్ని పోస్ట్ చేసి "#SeshEXShruti తనని పరిచయం చేస్తున్నాము @adivisesh అతని రాక ఆమె జీవితంలో తుఫానును తెస్తుందా? టైటిల్ , ఫస్ట్ లుక్ డిసెంబర్ 18న " అని రాశారు. హిందీ, తెలుగు భాషల్లో తెరకెక్కనున్న ఈ మెగా ప్రాజెక్టును అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియ యార్లగడ్డ నిర్మిస్తుండగా, అమెరికాలో పుట్టి పెరిగిన షానీల్ డియో దర్శకత్వం వహిస్తున్నారు. అడివి శేష్ 2022లో చేసిన మేజర్ సందీప్ ఉన్నికృష్ణన్ బయోపిక్ 'మేజర్' బ్లాక్ బస్టర్ విజయంతో దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంది. ఇప్పుడు చేస్తున్న మెగా ప్రాజెక్ట్ అడివి శేష్ కు రెండో స్ట్రయిట్ హిందీ మూవీ కానుంది. అడివి శేష్ 'క్షణం', 'గూఢచారి' తో సహా పలు తెలుగు బ్లాక్బస్టర్లకు గతంలో డీవోపీగా పనిచేసిన షానీల్ కు దర్శకుడిగా ఇది తొలి చిత్రం. కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్కు అధికారికంగా ఎంపికైన 'లైలా' అనే ప్రశంసలు పొందిన షార్ట్ ఫిల్మ్ కు ఆయన దర్శకత్వం వహించారు. "సినిమాలోని ప్రతి ఫ్రేమ్, డైలాగ్, సన్నివేశాన్ని హిందీతో పాటు తెలుగులో విడివిడిగా చిత్రీకరిస్తున్నాం. ప్రతి భాష సాంస్కృతిక ప్రత్యేకత బట్టి దీనిని విభిన్నంగా ట్రీట్ చేస్తున్నాం" అని మేకర్స్ ఇప్పటికే తెలియజేశారు. ఈ చిత్రానికి సునీల్ నారంగ్ సహనిర్మాత. అడివి శేష్ , షానీల్ డియో కలిసి కథ, స్క్రీన్ ప్లే సమకూర్చారు. ఈ ప్రాజెక్ట్కి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడికానున్నాయి.

# మెగాప్రిన్స్ మట్కా రెగ్యులర్ షూటింగ్



మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్, పలాస, శ్రీ దేవి సోడా సెంటర్ ఫేమ్ కరుణ కుమార్ దర్శకత్వంలో 'మట్కా' చిత్రంతో పాన్ ఇండియన్ అరంగేట్రం చేస్తున్నారు. వైర ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల, మోహన్ చెరుకూరి (సివిఎం) భారీ కాన్వాస్పై హై బడ్జెట్ , అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఈరోజు హైదరాబాద్లో ప్రారంభమైంది. ప్రస్తుతం జరుపుకుంటున్న షూటింగ్ కోసం ఓ భారీ సెట్ను నిర్మించారు. ఈ కథ 1958, 1982 మధ్య జరిగినందున, యూనిట్ 50, 80ల నాటి పరిసరాలను అద్భుతంగా రిక్రియేట్ చేస్తున్నారు. యావత్ దేశాన్ని కదిలించిన యదార్థ సంఘటన ఆధారంగా 'మట్కా' కథను రూపొందించారు. 24 ఏళ్లస్పాన్ కలిగిన కథలో వరుణ్ తేజ్ నాలుగు విభిన్నమైన గెటప్లలో కనిపించనున్నారు. వరుణ్ తేజ్ కు హయ్యస్ట్ బడ్జెట్ ఎంటర్టైనర్గా ఉండే ఈసినిమా కోసం వరుణ్ పూర్తి మేక్ఓవర్ అవుతున్నారు. రుణ్ తేజ్ సరసన నోరా ఫతేహి, మీనాక్షి చౌదరి హీరోయిన్స్ గా నటిస్తున్న ఈ చిత్రంలో నవీన్ చంద్ర, కన్నడ కిషోర్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈచిత్రానికి అత్యుత్తమ సాంకేతిక నిపుణుల పని చేస్తున్నారు. సౌత్లో అత్యంత బిజీగా ఉన్న కంపోజర్లలో ఒకరైన జివి ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తుండగా, తంగలన్ ఫేమ్ ఏ కిషోర్ కుమార్ డీవోపీగా పని చేస్తున్నారు. కార్తీక శ్రీనివాస్ ఆర్ (పుష్ప ఫేమ్) ఎడిటర్. ఆశిష్ తేజ పులాల ప్రొడక్షన్ డిజైనర్, సురేష్ ఆర్ట్ డైరెక్టర్. మల్టిపుల్ యాక్షన్ సీక్వెన్స్ లు ఉన్న ఈ చిత్రానికి నలుగురు ఫైట్ మాస్టర్లు యాక్షన్ ను పర్యవేక్షిస్తున్నారు. 'మట్కా' తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో విడుదల కానుంది. తారాగణం: వరుణ్ తేజ్, నోరా ఫతేహి, మీనాక్షి చౌదరి, నవీన్ చంద్ర, కన్నడ కిషోర్, రవీంద్ర విజయ్, సత్యం రాజేష్, రవిశంకర్, అజయ్ ఘోష్, రూప లక్ష్మి, అవినాష్ కనపర్తి

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Publishedat # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com